క్లుప్తంగా

మూఢ విశ్వాసాల నిర్మూలనలో జేవీవీ కీలకం



నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్‌లో మ్యాజిక్ షోను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: ప్రజల్లో నెలకొన్న మూఢ విశ్వాసాలను పోగొట్టడంలో జన విజ్ఞాన వేదిక (జేవీవీ) కీలకపాత్ర పోషిస్తోందని నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని కేకేఎల్ కుమారి అన్నారు. పాఠశాలలో శనివారం రామచంద్రపురం జేవీవీ కార్యవర్గ సభ్యుడు చెల్లుబోయిన శ్రీరాములు మ్యాజిక్ షో ప్రదర్శించారు. దొంగ బాబాలు మ్యాజిక్‌లు ప్రదర్శించడం ద్వారా ప్రజల్లో ఎటువంటి మూఢ నమ్మకాలను పెంచి పోషించారో అవగాహన కల్పించారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని వివరించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ ఎక్స్‌అఫీషియో సభ్యుడు వారణాసి సత్తిబాబు, సైన్స్ ఉపాధ్యాయులు పి.రవికుమార్, జి.ఉమాశ్రీవాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే బీసీలకు ప్రాధాన్యం

కాజులూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే రాష్ట్రంలోని బీసీలకు తగిన ప్రాధాన్యం లభిస్తోందని మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెంకే విశ్వేశ్వరరావు అన్నారు. శనివారం కాజులూరు శివారు చాకిరేవుమెరకలో సంఘం ప్రధాన కార్యదర్శి నరాల శ్రీను అధ్యక్షతన జరిగిన సంఘ సభ్యుల సమావేశంలో విశ్వేశ్వర్రావు మాట్లాడుతూ స్థానిక సంస్థల కోటాలో బీసీ వర్గానికి చెందిన కుడుపూడి సూర్యనారాయణరావును పార్టీ ఎమ్మెల్సీగా ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. జగనన్న అధికారంలోకి వచ్చాక బీసీలు మంత్రులుగా, ఉపముఖ్యమంత్రులుగా, ఎంపీలుగా, ఎమ్మెల్సీలుగా పదవులు చేపట్టారన్నారు. కార్యక్రమంలో మండల బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు దెయ్యాల సత్తిబాబు, ట్రెజరర్ కట్టా సత్యనారాయణను పలువురు సంఘ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

మండపేట: ఆలోచన విధానాన్ని పెంపొందించుకోవడం ద్వారా నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని ఎంటర్‌ప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఈఎండీపీ) ఉభయ గోదావరి జిల్లాల డీఎం ఉదయ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈఎండీపీలో భాగంగా స్థానిక ఎస్‌వీఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక శిక్షణ తరగతులు, ప్రాజెక్టులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ స్వజనాత్మకత, నైపుణ్యంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. త్వరలో జరగనున్న ప్రాజెక్టు ఎక్స్‌పో గురించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఐఎస్ఎస్ ప్రసాద్, బి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వెల్లలో అన్నదానం

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల గ్రామంలో వేంచేసిన బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభామా సమేత గోపాలస్వామి, శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం కనులపండువగా జరిగింది. కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం దేవస్థానం ఆధ్వర్యంలో సుమారు 4 వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, ఆలయ ఈఓ ఎంవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు దివిజ కవితా సంకలనం ఆవిష్కరణ

అనపర్తి: కవితా వ్యాసాంగంలో కృషి చేస్తున్న గ్రామానికి చెందిన చాగంటి సుబ్రహ్మణ్యం రచించిన దివిజ కవితా సంకలనం ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో సాహితీ గోదావరి పత్రిక సంపాదకులు డాక్టర్ ర్యాలీ శ్రీనివాస్ పాల్గొని దివిజ కవితా సంకలనం ఆవిష్కరిస్తారని తెలిపారు.

సారా విక్రేత అరెస్ట్

అనపర్తి: పీరారామచంద్రపురంలో సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్సై పి.అప్పారావు తెలిపారు. పీరారామచంద్రపురం గ్రామ పరిధిలో సారా విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో సిబ్బందితో వెళ్లగా గ్రామ శివారులో సారా విక్రయిస్తున్న తీగిరెడ్డి శ్రీనుని అదుపులోకి తీసుకుని, అతడి నుంచి 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

బస్సులే రాని స్టాండ్

- 17 ఏళ్లుగా నిరుపయోగంగా..
- లీజుకు ఇచ్చే యోచనలో అధికారులు
- మండపేట ఏడిద రోడ్డులోని బస్టాండ్ దుస్థితి



మండపేటలో నిరుపయోగంగా ఉన్న బస్టాండు

మండపేట: నాలుగు ప్లాట్‌ఫాంలు, బస్సుల వివరాల తెలిపే బోర్డులు, ప్రయాణికుల ఎంక్వయిరీ కౌంటర్. వీటన్నింటినీ చూసి ఇక్కడ బస్సులు వచ్చి ఆగుతాయని వేచి చూస్తే నిరీక్షణే మిగులుతుంది. పేరుకు ఆర్టీసీ బస్టాండే అయినా వినియోగానికి నోచుకోక 17 ఏళ్లుగా నిరుపయోగంగా ఉంది. అక్కరకు రాకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులకు లీజుకిచ్చే ఆలోచనలో ఆర్టీసీ అధికారులు ఉన్నారు. మండపేట మెయిన్ రోడ్డులోని బస్‌షెల్టర్ ఇరుకుగా ఉండడంతో స్థానిక ఏడిద రోడ్డులో రెండెకరాల విస్తీర్ణంలో సుమారు రూ.20 లక్షల వ్యయంతో వేగుళ్ల సూర్యారావు బస్‌స్టేషన్ నిర్మించారు. ఈ బస్‌స్టేషన్ కోసం 1999 ఏప్రిల్ 4న అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనుల అనంతరం 2005 ఆగస్టు 22న దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ బస్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ బస్టాండ్‌కు మొదట్లో కొద్ది రోజులు బస్సులు నడిపినా పట్టణానికి మూలగా ఉండడంతో అక్కడకు వెళ్లేందుకు ప్రయాణికులు ఆసక్తి చూపించేవారు కాదు. దీంతో అక్కడికి బస్సు సరీ్వసులను అధికారులు రద్దు చేశారు.

వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య

ప్రస్తుతం మెయిన్ రోడ్డులో ఉన్న బస్టాండు ఇరుకుగా ఉండడంతో బస్సులు మలుపు తిరిగేటపుడు తరచూ ఇక్కడ ట్రాఫిక్ జామై ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాల దృష్ట్యా మెయిన్ రోడ్డును వెడల్పు చేస్తే బస్టాండు మరింత ఇరుకుగా మారి బస్సులు మలుపు తిరిగేందుకు వీలుండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రావులపాలెం వైపు వెళ్లే ప్రయాణికులు కూర్చునేందుకు షెల్టర్ లేక రోడ్డుపైనే పడిగాపులు పడాల్సి వస్తోంది.

కలువ పువ్వు సెంటర్‌లో బస్‌షెల్టర్, టాయిలెట్స్ సదుపాయం లేకపోవడంతో ప్రయాణికుల వెతలు వర్ణనాతీతం. రోడ్డుపైనే బస్సులను నిలిపి వేయడం వలన బస్సు కదిలేంత వరకూ తరచూ ట్రాఫిక్‌జామై వాహన చోదకులు, ప్రయాణికుల ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మరోపక్క చీకటి పడితే కొత్త బస్‌స్టేషన్ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందన్న విమర్శలున్నాయి. కొత్త బస్టాండును వినియోగంలోకి తీసుకురావడం ద్వారా ఆయా సమస్యలకు చెక్ పెట్టవచ్చునని భావించి గతంలో పలుమార్లు సర్వీసులు నడిపినప్పటికి ప్రయాణికులు అక్కడకు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో సర్వీసులు రద్దయ్యాయి.

రామచంద్రపురం ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ఈ బస్టాండు నిర్వహణ జరుగుతోంది. సర్వీసులు నడిపినా ప్రయాణికులు రాక నిరుపయోగంగా ఉండిపోవడంతో లీజుకు ఇవ్వడం ద్వారా ఆర్టీసీకి ఆదాయం తెచ్చేందుకు అధికారులు ఆలోచన చేస్తున్నారు. ఈ విషయమై ఆర్టీసీ రామచంద్రపురం డిపో మేనేజర్ వెంకటేశ్వరరావును సంప్రదించగా ప్రస్తుతం రాజమహేంద్రవరం వైపు వెళ్లే రెండు సర్వీసులు కొత్త బస్టాండు మీదుగా పంపిస్తున్నామన్నారు. భవిష్యత్తులో బస్టాండును లీజుకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

ఉండూరులో పొలంబడి



పంట పొలంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సత్యప్రసాద్

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఉండూరులో మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. గ్రామ వ్యవసాయ సహాయకులకు క్షేత్రస్థాయి శిక్షణలో పంట పొలంలోకి నేరుగా వెళ్లి మిత్రపురుగులు, శత్రుపురుగుల నిష్పత్తి ఆధారంగా పురుగుమందుల పిచికారీ అవసరమా కాదా అన్నది ఏ విధంగా తెలుసుకోవాలో వివరించారు. అదే విధంగా పంట పొలం పరిసరాల విశ్లేషణలో భాగంగా వాతావరణ పరిస్థితులు, ఉష్ణోగ్రత, పొలం పరిస్థితి తదితర అంశాలు పరిశీలిస్తూ పురుగుమందులు ఎంత వరకు అవసరమనేది తెలుసుకుని రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు. పురుగుమందులు పిచికారీ చేసేటప్పుడు రైతుల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

‘గాలికుంటు’ నుంచి పశువులకు రక్షణ



పాడి రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు

రామచంద్రపురం రూరల్: ప్రమాదకరమైన గాలికుంటు వ్యాధి నుంచి పశువులను రక్షించుకోవడానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న గాలికుంటు వ్యాధి వ్యాక్సినేషన్‌ను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎ.జయపాల్ సూచించారు. మండల వ్యవసాయ అధికారి డాక్టర్ ఎం.కృష్ణార్జున ఆధ్వర్యంలో మండలంలోని తోటపేటలో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరంలో జయపాల్ పాల్గొన్నారు. శిబిరంలో 30 మంది రైతులకు చెందిన 62 పశువులకు వ్యాక్సిన్లు వేసి, వైద్య సేవలు అందించారు. పశు సంవర్ధక శాఖ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామకోటేశ్వరరావు తన తల్లి పేరున అందజేసిన మినరల్ మిక్చర్ ప్యాకెట్లను సర్పంచ్ కోరపు కామరాజు, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ అల్లం నాగసంధ్య, పార్టీ సీనియర్ నాయకుడు దామిశెట్టి గంగాపురుషోత్తంల చేతుల మీదుగా రైతులకు అందజేశారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



గృహ నిర్మాణ లబ్ధిదారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

రాయవరం: జగనన్న కాలనీలో స్థలాలు పొందిన వారు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసుకోవాలని ఎంపీడీఓ డి.శ్రీనివాస్, హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈ కొవ్వూరి శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని చెల్లూరు, సోమేశ్వరం గ్రామాల్లో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం జగనన్న కాలనీల్లో రహదారులు, విద్యుత్తు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన రుణాలు, సిమెంట్, ఐరెన్, ఇసుక తదితర ముడి సరుకులు కూడా అందజేస్తోందని, లబ్ధిదారులను దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉగాది పండుగ నాటికి గృహప్రవేశ పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సోమేశ్వరం గ్రామంలో సర్పంచి ఆరిఫ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇళ్ల నిర్మాణ ప్రగతిని అధికారులు సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచిలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే పార్టీ బలోపేతం



కుయ్యేరులో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో మాట్లాడుతున్న తడాల సోమశేఖర్ తదితరులు

కాజులూరు: గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్ల సమష్టి కృషితోనే రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ మరింత బలోపేతమౌతుందని గృహసారథుల కమిటీ పరిశీలకుడు తడాల సోమశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని కుయ్యేరు, ఉప్పుమిల్లి, దుగ్గుదుర్రు గ్రామాలలో పరిశీలకులు పర్యటించి పార్టీలో కొత్తగా నియమితులైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. కుయ్యేరులో గ్రామ సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సోమశేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న దేశంలో ఎక్కడా లేనంత విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదలకు ఆసరాగా నిలిచారన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో దేశం తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమైనప్పటికీ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను ఎక్కడా అపలేదన్నారు. జగనన్న సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష అని అన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు వలంటీర్లతో సమష్టిగా పనిచేసి జగనన్న పథకాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల గృహసారథుల కమిటీ కన్వీనర్ చింతపల్లి నాగేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు చీకట్ల సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్ మేకల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ



పట్టణంలోని స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న వైద్యాధికారులు

రామచంద్రపురం: బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లను వైద్యాధికారులు శనివారం తనిఖీలు చేశారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరం అనే నినాదంతో ఈనెల ఒకటో తేదీ నుంచి బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమాన్ని మహిళా దినోత్సవం వరకు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఆదేశాల మేరకు పట్టణంలోని డాక్టర్ టి.మాణిక్యం, హెల్త్ సూపర్‌వైజర్ జి.కమల్ శేషు తదితరులు గాంధీ ఆసుపత్రి, సాయిశ్రీకృష్ణక్లినిక్, సూర్య హాస్పిటల్, శారదా నర్సింగ్ హోం, వెంకటేశ్వర స్కానింగ్ సెంటర్, తదితర వాటిని సందర్శించి రికార్డులను పరిశీలించారు. నివేదికను జిల్లా అధికారులకు అందించనున్నట్లు వారు తెలిపారు.

జగనన్న కాలనీలో గృహప్రవేశానికి ప్రముఖులు



కపిలేశ్వరపురంలో జగనన్న గృహం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: స్థానిక జగనన్న కాలనీలో కొత్తగా నిర్మించుకున్న గృహ ప్రవేశానికి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు హాజరయ్యారు. కపిలేశ్వరపురానికి చెందిన కట్టా మురళీకృష్ణ, నాగమణి దంపతులు శుక్రవారం రాత్రి నూతన గృహంలోకి అడుగు పెట్టారు. శనివారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ తనయుడు సూర్యప్రకాష్, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, మండలంలోని పలు పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు హాజరయ్యారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా జగనన్న కాలనీలను అభివృద్ధి చేస్తున్నామని, ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగంచేసుకుని త్వరితగతిన ఇల్లును నిర్మించుకోవాలని సూచించారు.

విజయానికి వారధులు గృహసారథులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ఐదు గ్రామాల గృహ సారథులకు దిశా నిర్దేశం



సచివాలయ కన్వీనర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనను గృహ సారథులు ప్రజలకు మరింత చేరువ చేయడం ద్వారా రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ విజయానికి వారధులు కావాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సూచించారు. ×మా నమ్మకం నీవే జగన్× కార్యక్రమంలో భాగంగా మండలంలోని అర్తమూరు, తాపేశ్వరం, పాలతోడు, వెలగతోడు, ఇప్పనపాడు గ్రామాల గృహ సారథులతో శనివారం సాయంత్రం తాపేశ్వరం అతిథి ఫంక్షన్ హాలో ఎమ్మెల్సీ తోట సమావేశం అయ్యారు. ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో సంక్షేమం పరుగులు పెడుతోందన్నారు. ఆయన తీసుకువచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. అవినీతికి తావులేకుండా పాలనలో పారదర్శకతను తీసుకు రావడంతో పాటు సంక్షేమ పథకాలను లబ్ధిదారుల చెంతకే చేరవేస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. బాధ్యతలు, విధులు గూర్చి గృహసారథులకు ఎమ్మెల్సీ తోట దిశా నిర్దేశం చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్రనేతలు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, పార్టీ నాయకులు గొలుగూరి సందీప్‌రెడ్డి, పిల్లా అరవరాజు, బూర చిన్న, తిరుశూల శ్రీనివాస్, ఈదల వీరాస్వామి, సిరిపురపు శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ గృహసారథులు తమ పరిధిలోని ప్రజలతో మమేకం కావాలన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా వారి వారి కుటుంబాలకు చేకూరిన లబ్ధి వివరించడంతో పాటు ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని సూచించారు. అనంతరం నూతనంగా నియమించిన సచివాలయ కన్వీనర్లను ఎమ్మెల్సీ తోట సత్కరించారు. సర్పంచులు గొలుగూరి అన్నపూర్ణ, పిల్లా వెంకటలక్ష్మి, నలమామిడి కృపరాజు, ఆర్‌బీకే మండల కమిటీ చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, జేసీఎస్ కన్వీనర్ బందెల సాయిరాం, దేవస్థానం చైర్మన్ బొగ్గవరపు సీతామహాలక్ష్మి, పార్టీ నాయకులు నాగిరెడ్డి రాంబాబు, చిన్ని గంగాధరం, తిరుశూల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



యనమదలలో కన్వీనర్లు, గృహసారథులకు సూచనలు చేస్తున్న వాద్రేవు సాయిప్రసాద్

రామచంద్రపురం రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పేద ప్రజలకు జరుగుతున్న మేలును ప్రజల్లోకి తీసుకుని వెళ్లి వైఎస్సార్ సీపీ బలోపేతానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు రామచంద్రపురం మున్సిపల్ చీఫ్ విప్ వాద్రేవు సాయిప్రసాద్ కోరారు. మండలంలోని యనమదలలో కన్వీనర్లు, గృహసారథులతో సమీక్ష నిర్వహించారు. తమ పరిధిలోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ పార్టీకి, ప్రజలకు అనుసంధాన కర్తలుగా సేవలందించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పంపన వీరవెంకటరమణ, ఎంపీటీసీ నురుకుర్తి శ్రీరామకృష్ణ, కన్వీనర్లు కుక్కల గోవిందు, పెయ్యల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలి

కె.గంగవరం: గ్రామ స్థాయిలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలని సుందరపల్లి సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జ్ శాఖ బాబి అన్నారు. మండలంలోని తామరపల్లి పంచాయతీ వద్ద శనివారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా గృహసారథులు, కన్వీనర్లు పనిచేయాలని తెలిపారు. బూత్ స్థాయిలో ఉండే ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి చేసిన పనులను గురించి ప్రజలకు సవివరంగా తెలియజేయాలన్నారు. వలంటీర్లతో గృహసారథులు, కన్వీనర్లు భాగస్వాములై ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. కన్వీనర్లు మేడిశెట్టి దుర్గారావు, రెడ్డి జయరాజు, పిల్లి రాంబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహిళలకు సామాజిక భద్రత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయ

కె.గంగవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు సామాజిక భద్రత కల్పించాలని ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షురాలు పి.విజయ అన్నారు. కె.గంగవరంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ ఆవరణలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సదస్సు నిర్వహించారు. మహిళా నాయకురాలు బుద్దా గౌరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలకు సామాజిక భద్రత ప్రశ్నార్థకంగా మారిందని ఇంటా బయట మహిళలపై దాడులు తీవ్రం అవుతున్నాయన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థికంగా కుటుంబాలను బలోపేతం చేసుకోవాలని కోరారు.

గ్యాస్ ధర తగ్గించాలని రాస్తారోకో..

గత రెండు రోజుల క్రితం కేంద్రం వంటగ్యాస్ బండపై రూ.50 పెంచడాన్ని నిరసిస్తూ పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో కె.గంగవరం బస్టేండ్ సెంటర్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు దేశాన్ని దోచిపెడుతూ సామాన్యుల వద్ద నుంచి సొమ్ములు ముక్కుపిండి వసూలు చేస్తుందని విమర్శించారు. గత మూడేళ్ల కాలంలో వంటగ్యాస్ ధర రూ.500 నుంచి రూ.1200కు పెంచడం దారుణమన్నారు. సీపీఐయంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు చీకట్ల వెంకట్రావు, ఏఐకేయంఎస్ నాయకులు వెంటపల్లి భీమశంకరం, మహిళ నాయకులు మద్దా గౌరమ్మ, ధనలక్ష్మీ, రావి బాసమ్మ, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.


చట్టాలు, హక్కులపై మహిళలకు అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి మాధవీదేవి

రామచంద్రపురం: మహిళలకు రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకోవాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవీదేవి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 3వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మహిళా దినోత్సవ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మెప్మా విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి మాధవీదేవి మాట్లాడుతూ కోర్టు ద్వారా ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. మున్సిపల్ మేనేజర్ మూర్తి, సీఈఓ మహాలక్ష్మి, ప్యానల్ అడ్వకేట్ దొమ్మలపాటి సత్యనారాయణ కోర్టు సిబ్బంది ఉమా తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడిగా వీరన్నశెట్టి



గుత్తుల వీరన్నశెట్టి

రామచంద్రపురం: పట్టణ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు గుత్తుల వీరన్న శెట్టిని ఆ సంఘం నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని శెట్టిబలిజ కల్యాణ మండపంలో శనివారం పట్టణ సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా మున్సిపల్ వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, కౌన్సిలర్లు బొక్కా సత్యనానరాయణ, కేతా శ్రీను, గుబ్బల గణ, తదితరులు హాజరయ్యారు. అధ్యక్షుడిగా వీరన్నశెట్టి, ఉపాధ్యక్షుడిగా పంపన శ్రీనివాస్, కార్యదర్శిగా జుత్తుగ గులాంబాషా, కార్యవర్గ సభ్యులుగా సీహెచ్ సూరిబాబు, దంగేటి గౌరీశంకర్, నీలం శివశంకర్, రెడ్డి గోవిందు, రాంబాబు, టి.శ్రీనివాస్, సత్తిబాబు, ప్రసాద్‌లను ఏకగ్రీవంగా సంఘ సభ్యులు ఎన్నుకున్నారు. పట్టణ వైఎస్సార్ సీపీ నేతలు సూరంపూడి సుబ్రహ్మణ్యం, దంగేటి భద్రరావు, శీలం గంగరాజు, కుడిపూడి గణేష్, నున్నబోయిన ప్రసాద్, నరాల సురేష్, పాటి ప్రసాద్, తదితరులు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు.

ఘనంగా వేణుగోపాల స్వామి కల్యాణం

కపిలేశ్వరపురం: అంగరలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణాన్ని శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్వామిని దర్శించుకుని భక్తులతో కలిసి కల్యాణాన్ని వీక్షించారు. శనివారం స్వామికి విశేషార్చనలు, నిత్యహోమములు, బలిహరణ తదతర పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కట్టా రామచంద్రరావు, ఈఓ ఏఎస్‌బీజీ రామలింగం ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో అంగర, పడమర ఖండ్రిక పంచాయతీల సర్పంచులు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గారావు, అడ్డాల శ్రీనివాస్, పెద్దిరెడ్డి శేషారత్నం, ట్రస్టుబోర్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.